క్లుప్తంగా

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణ కల్పించి, జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు చూపిస్తామని తెలిపారు. ఇంటర్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు జూలై 3వ తేదీలోపు స్కిల్‌హబ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 96665 45975 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

పలకలూరు రోడ్డులో లారీ చోరీ

గుంటూరు ఈస్ట్: రోడ్డుపక్కన నిలిపి ఉన్న లారీ చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అన్వర్‌బాషా అనే లారీ డ్రైవర్ జనవరి నెలలో లారీని పలకలూరు రోడ్డులో నిలిపి ఇంటికి వెళ్లాడు. 20 రోజుల తరువాత వచ్చి చూడగా లారీ కనిపించ లేదు. లారీ కోసం వెతికి చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాకథాన్ పోటీల్లో ఆర్వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థుల ప్రతిభ నైపుణ్యాల ప్రదర్శనలకు లభించే పురస్కారాలతో కళాశాల కీర్తి జాతీయ స్థాయిలో దూసుకెళ్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఐఈఈఈ సహకారంతో నిర్వహించిన జాతీయస్థాయి 48 గంటల హ్యాకథాన్ పోటీల్లో ఐఓటీ డొమైన్ విభాగంలో తమ కళాశాల విద్యార్థులు ఘన శ్యామ్, ఎస్.ఆదిశయంబోస్, కె.నిఖిత, సీహెచ్ ఇంద్రజల జట్టు రూపొందించిన రిమోట్ హెల్త్ మానిటరింగ్ అనే పరికరం నూతన ఆవిష్కరణ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో మొదటి స్థానం లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగంలో నెలకొన్న పోటీ తత్వంలో నూతన ఆవిష్కరణలే దేశ ప్రగతికి కీలకంగా మారాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రదర్శనలో అనారోగ్యంతో బాధపడే వారికి సత్వర వైద్య సేవలకు తగిన సూచనలను అందించే దిశగా విద్యార్థుల పరిశోధన సాగిందన్నారు. వాయిస్ అసిస్టెంట్ కమాండ్ ద్వారా కూడా ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు. అతి తక్కువ వ్యయంతో రూపొందించిన పరికరం, ప్రతిభకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.కార్తీకపవన్ అవార్డు పొందిన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



శేకూరు(చేబ్రోలు): బడి ఈడు వయస్సు కలిగిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండలంలోని శేకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికిపోతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పలువురు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపేందుకు అంగీకరించేలా చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు రాయల సుబ్బారావు, ఏవీహెచ్ ప్రసాద్‌లు మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించటానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ప్రసాద్, జోసెఫ్ సుధీర్ బాబు, గోపాలకృష్ణయ్య, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. దోమలువృద్ధి చెందే కాలం

- దోమతెరలు వాడాలి
- డీఎంహెచ్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెంది పలు రకాల జ్వరాలు దోమ కాటు ద్వారా వస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. దోమ కాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. మలేరియా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు పట్టణంలోని శ్రీనివాసరావుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌ఓ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు మొదలైన రీత్యా పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల, ఆ ప్రదేశాలు దోమలకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. నీరు నిల్వ లేకుండా తరచుగా పరిసరాలు శుభ్రపరచుకోవాలన్నారు. ఇళ్లలోని తొట్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన టీ కప్పులు, పాత రోళ్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో నివారణ చర్యలను తరచుగా చేపట్టాలన్నారు. సాయంత్రం సమయంలో వేప పొగ పెట్టడం, దోమతెరలు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమకాటు నుంచి రక్షించుకోవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, దోమల నివారణ చర్యలపై ప్ల కార్డులు చేతబూని, నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రశాంత్, సూదా శివ గణేష్, సుకుమార్, సూరి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వసతి కల్పించాలంటూ వినతి



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భీమ్ భారత్ నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు నగరం కోడి గుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు వసతి కల్పించాలని, హాస్టల్‌ను గురుకల విద్యాలయంగా మార్చి అన్ని హంగులతో భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో భీమ్ భారత్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్ పనులు పునఃప్రారంభించి పేద విద్యార్థులకు గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా వాడుకలోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా దళిత క్రైస్తవులు చనిపోతే ఆనందపేట శ్మశానవాటికలో వారిని పూడ్చిపెట్టేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో 2013లో ఆనాటి ప్రభుత్వం గోరంట్ల వద్ద 11 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ సదరు స్థలం వివాదంలో ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఉగ్గం సాంబశివ రావు, డెన్నిస్‌రాయ్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ డ్రైవర్ అబ్దుల్ సలాంకు సన్మానం



అబ్దుల్ సలాం దంపతులను సత్కరిస్తున్న హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన షేక్ అబ్దుల్ సలాంకు శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ 41 ఏళ్లపాటు డ్రైవర్‌గా మంచి పేరు తెచ్చుకున్న సలాం వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో పని చేశారన్నారు. ఇప్పటికీ ఉద్యోగం పట్ల ఆయనకు ఎంతో గౌరవ భావాలు ఉన్నాయని తెలిపారు. ఫైవ్ స్టార్ డ్రైవర్‌గా విధుల నిర్వహణలో ఒక్క తప్పిదం లేకుండా, తన కుటుంబాన్ని, ఉద్యోగాన్ని చివరి వరకు కర్తవ్యంగా భావించారని కొనియాడారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించిన అబ్దుల్ సలాం మంచి వ్యక్తిత్వం గల వారు అని అన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ మాట్లాడుతూ సలాం ఒక మంచి డ్రైవర్‌గా, కుటుంబ బాధ్యతల నిర్వహణలోనూ మంచి పేరు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ సలాంను ఘనంగా సత్కరించారు. అదే విధంగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గతనెలలో ఉద్యోగ విరమణ పొందిన కె.డేవిడ్‌పాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు, కుటుంబ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ జీవన్ బాబుకు సన్మానం



జీవన్‌బాబును సన్మానిస్తున్న కార్యాలయ అధికారులు, ఉద్యోగులు

గుంటూరు మెడికల్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్.జీవన్ బాబు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఒ.అన్నపూర్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాజేంద్ర ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్ వి.భక్తవత్సల, పలువురు కార్యాలయ ఉద్యోగులు సన్మాన కార్యక్రమంలో పాల్గొని జీవన్‌బాబు చేసిన సేవలను కొనియాడారు. హంస యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కిరణ్ పర్యవేక్షణలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలపై విస్తృతస్థాయి చర్చ

వట్టిచెరుకూరు మండల సర్వసభ్య సమావేశం



డయేరియా నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజ్యం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ చిలకా రాజ్యం అధ్యక్షతన మండల అభివృద్ధికి గత సమావేశంలో తీసుకున్న అజెండాను ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఈవో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3015 మంది విద్యార్థులు చదువుతున్నారని, అందులో 392 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ 46 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు 3 ఉన్నాయని, మిగిలినవి అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని తాగునీరు ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. ప్రతిరోజు ప్రజలకు వాటర్ పంపిణీ చేసే సమయంలో క్లోరినేషన్ చేయాలన్నారు. ఫీల్డ్ కిట్స్ ద్వారా మూడు శాంపిల్స్ తీసుకుని టెస్ట్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. గ్రామాల్లో ఫిల్టర్ చేసిన వాటర్ మాత్రమే పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల్లో డయేరియా క్యాంపులు నిర్వహించాలని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి లక్ష్మి మాట్లాడుతూ వరి విత్తనాలు, పిల్లి పెసర సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు తీసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ గురించి సమస్యలు ఏమైనా ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి నెలకొందని, మరో నెలరోజులు వ్యవధిలో పంటలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వెటర్నరీ అధికారులు మాట్లాడుతూ గేదెలకు గొంతువాపు నివారణకు, గొర్రెల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ సుచిత మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు టీబీ రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నట్లు వివరించారు. అతిసార వ్యాధి నిరోధక చర్యలు జూన్ 1 నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి

తెనాలిఅర్బన్: పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదకరంగా ఆవరణను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రజక చెరువు వద్ద ఉన్న పార్కును శనివారం ఆయన పరిశీలించారు. పార్కును శుభ్రంగా ఉంచడంతో పాటు వాకర్స్‌కు అనుకూలంగా ఉంచాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య



పట్నంబజారు: సచివాలయ కార్యదర్శి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురంలో నివాసం ఉండే అందుగుల జోయల్ శ్యామ్‌సన్ (44) గుంటూరు తూర్పు పరిధిలోని 53వ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇదే క్రమంలో కొద్దికాలంపాటు 52వ సచివాలయ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో శనివారం ఉదయం 52వ సచివాలయ కార్యాలయం పైన ఉన్న స్టేషనరీ రూములోకి ఆ సచివాలయ ఉద్యోగి వెళ్లిన క్రమంలో భరించలేని దుర్వాసన వచ్చింది. సదరు ఉద్యోగి పరిశీలించడంలో జోయల్ శ్యామ్‌సన్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు పదిరోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈక్రమంలో సచివాలయ ఉద్యోగుల నుంచి సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతికి సంబంధించి కుటుంబ కలహాలు కారణమా, ఇతరత్ర ఏమైనా ఉన్నాయా అని దర్యాప్తు చేస్తున్నారు. 52వ సచివాలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై నలుగురు దాడి

గుంటూరు ఈస్ట్: అపార్టుమెంట్‌లో మెయిటెన్స్ చెల్లించని మహిళపై నలుగురు మహిళలు దాడిచేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అపార్టుమెంట్‌లో నివాసం ఉండే బి.వనజ కొన్ని నెలలుగా ఫ్లాట్ మెయిటెన్స్ డబ్బులు చెల్లించడం లేదు. దీనిపై అపార్టుమెంట్‌లోని నలుగురు మహిళలు నిలదీశారు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. నలుగురు మహిళలు వనజను కొట్టి, ఫ్లాట్‌లోని సామాను ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని: ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రాం ఫర్ టెక్నాలజీ ఎన్హాన్స్‌మెంట్ లెర్నింగ్) పరీక్ష నందు వీవీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్తమ ప్రదర్శన చూపి సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ అధునాతన పద్ధతులను విద్యార్థులకు, అధ్యాపకులకు పరిచయం చేస్తూ దేశ ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటీ, ఐఐఎస్‌సీ వంటి సంస్థల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణనివ్వడం జరిగిందన్నారు.

భూములు అవసరాన్ని బట్టి తీసుకోవాలి

కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఉండవల్లి గ్రామంలో రైతులు సీడ్ యాక్సిస్ రోడ్డుకు భూములు ఇవ్వడానికి నిరాకరిస్తూ ఆందోళన చేపట్టారని, అప్పుడు భూ సేకరణ చట్టం లేదని, అందువల్ల భూ సమీకరణ కింద భూములు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి వచ్చిందని, ఇప్పుడు భూ సేకరణ చట్టం అమల్లో ఉంది గనుక తనకు అవసరమైన భూమిని ప్రభుత్వం తీసుకోవచ్చని కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విచక్షణతో ఆలోచించి భూ సేకరణకు ముందుకు వెళ్లవచ్చన్నారు. గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ చేయవచ్చా లేదా అన్న విషయంలో భూ సేకరణ చట్టం భూ యజమానులకు కల్పించిన హక్కులను కూడా ఉండవల్లి గ్రామ ప్రజలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. భూములు ఇవ్వడం, భూములు తీసుకోవడం అనేది అవసరాన్ని బట్టి మాత్రమే ఉండాలని వెల్లడించారు. హేతుబద్ధత లోపించినప్పుడు తిరుగుబాటు కూడా వస్తుందన్నారు. ఉండవల్లి తదితర గ్రామాల ప్రజలు 2014లో భూములు ఇవ్వడానికి నిరాకరించినప్పుడు పవన్ కల్యాణ్ ఈ ప్రాంతంలో పర్యటించి బలవంతంగా భూములు సేకరిస్తే, ఈ ప్రాంతంతో, విజయవాడ ప్రాంతంలో ఆగిపోయిన కుల ఘర్షణలు మళ్లీ తలెత్తుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారని, ఇప్పుడు ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. ఈ సమయంలో తమ భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్న ఉండవల్లి గ్రామ ప్రజల వైఖరి పట్ల పవన్ కళ్యాణ్ స్పందించడం అవసరమని అన్నారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ

తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు బాక్సులను అందజేశారు. సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నిబద్ధతతో కూడిన సేవలతోనే గుర్తింపు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విజయలక్ష్మి, రాజాసుందరబాబు దంపతులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఖాసిం, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో కూడిన సేవలు అందించిన వారిని సమాజంలో శాశ్వతరీతిలో గుర్తింపు దక్కుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసిన బడుగు విజయలక్ష్మి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయినిగా విశిష్టమైన సేవలు అందించిన విజయలక్ష్మి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో చెరగని ముద్ర వేశారన్నారు. మరొక అతిథి ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బాలికా విద్యకు నిలయంగా తీర్చిదిద్దడంలో హెచ్ఎంగా విజయలక్ష్మి విశేష కృషి చేశారని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఆమె సేవలు మరువలేనివన్నారు. గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో సేవలు అందించిన విజయలక్ష్మి సహచర ఉపాధ్యాయులకు మార్గదర్శిగా నిలిచారని అన్నారు. సన్మాన గ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ 36 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో 24 ఏళ్లపాటు ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం దక్కిందని, ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయులతో స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతల నిర్వహణలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈసందర్భంగా విజయలక్ష్మి, గోళ్ల రాజాసుందరబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవోచంద్రమోహన్, మద్దు ప్రేమ్‌జ్యోతిబాబు, ఎంఈవో నాగేంద్రమ్మ, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు బి.హైమారావు, పలువురు దళిత ఉద్యోగ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి సహకరించాలి



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ టీడీపీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపాలని కోరారు. ముందుగా ఎంపీకి ఫ్లోర్ ఎంపికైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ నాయకులు తలమాల రత్నబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మా-డి విద్యార్థులకు క్యాంపస్ ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో జూపూడి రంగరాజు, నాగభూషణం, సీతారామయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం చెన్నైకు చెందిన విక్యూర వెల్‌నెస్ క్లినిక్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో హిందూ ఫార్మసీ కళాశాలకు చెందిన తొమ్మిది మంది ఫార్మా.డి విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. ఏపీ, తెలంగాణాల్లో కన్సల్టెంట్ డాక్టర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన 15 మంది విద్యార్థుల్లో తొమ్మిది మందిని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. విక్యూర హెచ్‌ఆర్‌డీ ప్రతినిధి ఉషా నందిని పర్యవేక్షణలో శ్వేత, శక్తి పాల్గొని విద్యార్థులకు ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.25 వేలు వేతనంతో పాటు ఇన్సెంటివ్స్ లభిస్తాయని, సంబంధిత విద్యార్థులకు 10 రోజుల్లో నియామక పత్రాలు అందుతాయన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్‌మెంట్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మలబార్‌లో 'నువ' డైమండ్స్ కలెక్షన్స్ ప్రారంభం



సరికొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించిన రేష్మధరియా

నగరంపాలెం: గుంటూరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ లో 'నువ' డైమండ్స్ కలెక్షన్స్ విలాసవంతమైన వజ్రాభరణాలుగా అద్భుతంగా రూపొందించిన ఒక వేడుక 'నువ' సేకరణ అని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ అన్నారు. లక్ష్మీపురంలోని షోరూంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సరికొత్త కలెక్షన్‌ను మలబార్ మేనేజ్‌మెంట్ బృంద సభ్యుల సమక్షంలో రేష్మ ధరియా ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూఏఈలో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో 'నువ' పేరుతో తమ సరికొత్త వజ్రాభరణాల సేకరణను ఆవిష్కరించారని పేర్కొన్నారు. ప్రఖ్యాత భారత సినీనటి కరీనా కపూర్‌ఖాన్ ఈ 'నువ' కలెక్షన్‌కు అంబాసిడర్‌గా పరిపూర్ణత చేకూర్చారని అన్నారు. ఇకపై దేశంలోని అన్ని షోరూంలలో 'నువ' సేకరణ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

తెనాలి: డాక్టర్స్ డే సందర్భంగా రెయిన్‌బో ట్రస్ట్, తెనాలి, డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ డి.జీవనలత తెలియజేశారు. ప్రకాశం రోడ్డు లోని లతాస్ డయాబెటిక్ కేర్‌లో నిర్వహించే శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించి వివరాలను తెలిపారు.